# నా సాహితీ జీవనంలో జరిగిన కథ

## మల్లాది వెంకట కృష్ణమూర్తి



కేవలం ‘కౌముది‘ పాఠకుల కోసమే మల్లాది గారు మొట్టమొదటి సారిగా వ్రాస్తున్న సంచలనాత్మక శీర్షిక

*1970 నుంచి సాహిత్య మార్గంలో నాకు ఎదురైన అనేక సంఘటనలని, అనుభవాలని పాఠకులతో పంచుకోవడానికి ఈ శీర్షికను ఆరంభిస్తున్నాను. తరచూ నన్ను పాఠకులు అడిగే అనేక ప్రశ్నలకి జవాబులు ఇందులో దొరుకుతాయి. నాకు ఈ మార్గంలో పరిచయం ఉన్న అనేకమంది ప్రముఖుల గురించి రాసే వివిధ విషయాలు, వారితో నా అనుభవాలు చదవడానికి పాఠకులకి ఆసక్తిగా ఉంటాయని విశ్వసిస్తున్నాను. నాకు డైరీ రాసే అలవాటు లేదు కాబట్టి తారీఖులు, నెలలు, సంవత్సరాలు, కొందరి పేర్లు అన్ని సందర్భాల్లోనూ ఇవ్వలేను. అందుకని కేవలం జరిగిన వాటి సారాంశాలని మాత్రమే ఇవ్వగలను. ఎలాంటి దాపరికాలు లేకుండా రాయదలచుకున్నాను కాబట్టి పాఠకులు దీన్ని కల్పితంగా భావించనవసరం లేదు. ఏ విషయం మీదైనా వారు ఇంకాస్త వివరాలు తెలుసుకోడానికి ప్రశ్నలు వేయచ్చు. అలాగే ఏ విషయం మీద తెలుసుకోవాలని ఉందో దాన్ని అడిగితే ఆ వివరాలు రాస్తాను. అయితే ఓ టాపిక్కు ముగిసేదాకా ఆగి దాని మీద నేను చెప్పనివాటి గురించి అడిగితే ఎవరికీ సమయం వృధాకాదు. మీరు టాపిక్కులని సూచించవచ్చు. నేను రాయదలచుకున్న జాబితాలో అవి ఉంటే సరే. లేకపోతే మిగతా పాఠకులకి, నాకు ఈ విషయంలో సహాయం చేసినవారు అవుతారు. అనుమానం ఉన్న సంగతులని వదిలేయదలిచాను కాని అసత్యాలని మాత్రం రాయదలచుకోలేదు. కొందరికి ఇవి బాధని కలిగించవచ్చు. కాని సత్యానికి దగ్గరగా ఉండాలంటే ఇది తప్పదు.*

\- మల్లాది

*There are three rules for writing the novel. Unfortunately no one knows what they are.*

*--- W. Somerset Maugham*

# 5




**1980లలో శ్రీ రాజా** సిల్క్‌స్మిత కి పర్సనల్ అసిస్టెంట్‌గా ఉన్నారని సినిమా ఇండస్ట్రీలో ఎవరి ద్వారానో నాకు తెలిసింది.

విజయలో బాపినీడుగారు సంపాదకులుగా, వ్యాపారస్తుడుగా గొప్ప ప్రతిభని కనపరిచారు. జయసుధ, జయప్రదల జాకెట్ కొలతలు ఇవ్వడం, కళ్ళు మాత్రమే ఇచ్చి నటీనటులని కనుక్కోమనే క్విజ్, శ్రీ గొరీశంకర్, ఒంగోలు రాసిన నిష్పక్షపాతమైన సినిమా రివ్యూలు, వీటిలో బాపినీడు సొంత సినిమాల మీద కూడా విమర్శ పక్షపాతం లేకుండా ఉండేది. శ్రీ భరణి అనే రచయిత విజయ ఎడిటోరియల్ పని చూసేవారు. తర్వాత శ్రీ నాయని కృష్ణమూర్తి చూసేవారు.

వడపళనిలో మెయిన్ రోడ్ మీద విజయ స్టూడియోకి కొంచెం ఇవతల శ్రీ బాపినీడుగారి స్వంత ప్రెస్ ఉండేది. అందులోనే బొమ్మరిల్లు, విజయ పత్రికలు అచ్చయ్యేవి. శ్రీ రాజా ప్రెస్ వ్యవహారాలని చూసేవారు.

చందమామలో నా కథలు ఎన్ని ప్రచురింపబడ్డా, మద్రాస్ వెళ్ళినప్పుడు నేను ఆ పత్రిక కార్యాలయానికి వెళ్ళలేదు. వనిత మంత్లీ ఎడిటర్ శ్రీ ఎం.ఎల్ నరసింహం నేను పంపిన రచనలు చదివి అంగీకరిస్తూ ఉత్తరం రాసారు. మద్రాస్ వచ్చినప్పుడు కలవమని అందులో సూచించారు.

ఓసారి నేను సినిమా పని మీద మద్రాస్ వెళ్ళి, అక్కడ నుంచి శ్రీ ఎం.ఎల్ నరసింహంకి ఫోన్ చేసాను. వారి ఆఫీస్‌కి నన్ను ఆయన ఆహ్వానించారు. విజయ స్టూడియోకి వస్తున్నానని తెలిసి, నన్ను వారు అక్కడ కలుసుకున్నారు, లంచ్ అవర్‌లో స్టూడియోలోనే వెనక ఓ భవంతిలోని వనిత చందమామ కార్యాలయానికి తీసుకువెళ్ళారు. సన్నగా తెల్లగా ఉండే శ్రీ నరసింహం వయసు అప్పట్లో 25-30లోపే. శ్రీ నరసింహం ఎంతో అంకిత భావంతో, జవాబుదారీతనం ఫీలవుతూ పత్రికని ఎడిట్ చేసేవారు. కలర్లో వచ్చే వనిత నేటికీ చాలామందికి గుర్తుండే పత్రిక.

చందమామలోని శ్రీ దాసరి సుబ్రమణ్యం గారి సీటు దగ్గరకి తీసుకెళ్ళి పరిచయం చేసారు. నేను చాలా ఇంటర్వ్యూలలో నా మొదటి కథ 'చందమామ'లో వచ్చిన సంగతి ప్రస్తావించడం శ్రీ దాసరి గారికి గుర్తుంది. చందమామకి అప్పటికే నేను రాయడం మానేయడంతో నన్ను మళ్ళీ కథలు రాసి పంపమని సూచించారు. వారితో నాలుగైదు నిమిషాలు మించి ముచ్చటించలేదు.

చందమామలో వచ్చిన సీరియల్స్ అన్నీ శ్రీ దాసరి రాసారని తెలిసి, వాటిని పుస్తకరూపంలో తీసుకు వస్తే అమ్మకాలు బావుంటాయని చెప్పాను. పదివేల కాపీలుకి తక్కువ అమ్ముడవవని కూడా చెప్పాను. వాటి హక్కులన్నీ చందమామ యాజమాన్యంకే ఉన్నాయని, ఎక్కడా తన పేరు లేదని శ్రీ దాసరి సుబ్రమణ్యంగారు చెప్పారు. ఆయన్ని వాటిని పుస్తకాలుగా వేయాలని ఓ పబ్లిషర్ కాంటాక్ట్ చేస్తే, ఇలా అన్నారని తర్వాత విజయవాడ పబ్లిషర్స్‌లో ఎవరో నాతో ఈ విషయాన్ని చెప్పారు.

"మా యాజమాన్యం ఇచ్చే జీతం నా ఖర్చుల మీద ఆధారపడి ఉంటుంది. ఒక్కరూపాయి జీతం పెరిగితే బావుండు. కడుపు నిండుతుంది అనుకునేలా ఎప్పుడూ ఆ రూపాయి తగ్గించి ఇస్తుంటారు. వారి ఉద్దేశంలో, లేకపోతే వీడు మనకి నిజాయితీగా ఉండడు అని".

అక్కడ్నించి శ్రీ లక్ష్మీ నరసింహం నన్ను చందమామ మేనేజింగ్ ఎడిటర్ శ్రీ బి. విశ్వనాథరెడ్డి దగ్గరకి తీసుకెళ్ళారు. ఆయన నన్నడిగిన మొదటి ప్రశ్న ఇది.

"మీరు సమాజంలోని బీదలకోసం ఏం చేస్తున్నారు?"

నేనా ప్రశ్నకి జవాబుగా ఎస్ ఓ ఎస్ చిల్డ్రన్స్ విలేజెస్ ఆఫ్ ఇండియా ద్వారా ఇందిరాగాంధీ హత్యానంతరం అనాధ అయిన, అభిజిత్ అనే సిక్కు పిల్లవాడికి స్పాన్సరర్‌గా ఉన్నానని చెప్పాను. నిజానికి ఇన్‌కంటాక్స్ రిబేట్ కోసం తప్ప నేను విశాల హృదయంతో ఆపని చేయలేదు. శ్రీ విశ్వనాధరెడ్డి రొటేరియన్ అని తర్వాత తెలిసింది. వనితలో శ్రీ నరసింహం నా చేత సీరియల్ రాయించాలని అనుకున్నారు. కాని శ్రీ విశ్వనాధ రెడ్డి అనుమతి లభించలేదు.

హైదరాబాద్ లోని పబ్లిక్ గార్డెన్స్ రోడ్డులో యువ మంత్లీ కార్యాలయం ఉండేది. ఓసారి నేను రాసిన ఓ నవలని తీసుకుని వెళ్ళాను. అసోసియేట్ ఎడిటర్ శ్రీ రామవరపు వేణుగోపాలావుకి ఇచ్చాను. ఆయన దాన్ని చదవకుండానే వేయనని చెప్పి తిరిగి ఇచ్చేసాడు. తర్వాత తెలిసింది ఆయన స్వతంత్రంగా కాక చక్రపాణి సూచనలమేరకే పత్రికని నడుపుతారని. యువనుంచి శ్రీ రామవరపు ఆంధ్రప్రభ డైలికి మారారు. ఓ రోజు వారు పోయారని కారణం ఆల్కాహాల్ అని విన్నాను. శ్రీ వేణుగోపాలరావు యువ మేనేజింగ్ ఎడిటర్ శ్రీ సుధాకర్‌ని పరిచయం చేసాడు. నల్లగా సన్నగా ఉన్న ఆయన ఓ రచయితగా నన్ను గుర్తించలేదు. నా పేరు ఓ రచయితగా ఆయనకి పరిచయం ఉందని నాకు తోచలేదు. తర్వాత ఎవరో చెప్పారు వీరు ఆల్కాహాలిక్ అని.

యువ మాసపత్రిక దీపావళి ప్రత్యేక సంచికని తీసుకువచ్చేది ఈ సంచికల్లో లబ్ధప్రతిష్ఠులైన వారి రచనలని ఉత్తరాలు రాసి తీసుకుని మాత్రమే ప్రచురించేవారు. భానుమతీ రామకృష్ణ అత్తగారి కథలు అలా వచ్చినవే. నా కథలెప్పుడూ యువ ప్రత్యేక సంచికల్లో రాలేదు. 'పుట్టమచ్చ' అన్న కథని నేను మామూలు సంచిక కోసం పంపాను. కాని ఆశ్చర్యంగా దాన్ని దీపావళి సంచికలో వేసారు. ఆ తర్వాత యువ ప్రత్యేక సంచికల్లో నా కథలు వచ్చాయి.

1974లో నేను గాంధీనగర్‌లో అద్దెకున్న వీధిలోనే శ్రీ తాళ్ళూరి నాగేశ్వరరావు అనే రచయిత ఉండేవారు. ఆంధ్ర పత్రికలో వీరి రచనలు చాలావచ్చేవి. ఆయన తెలుగు అకాడమిలో పనిచేసేవారు. యువ మాసపత్రికకి అనఫిషియల్‌గా ఎడిటర్‌గా పనిచేసేవారు. నా చిరునామాని బట్టి నేనుండేది వారింటి ప్రాంతమే అని గ్రహించి, తనని ఇంటి దగ్గర కలవమని నాకో కార్డు రాసారు. నిమిషం నడక దూరంలో ఉన్న వారింటిని అనేక సార్లు చూసాను కాని, అది వారిది అని తెలియదు. ఓ సాయంత్రం నేను వారింటికి వెళ్ళాను. యువలో నేను రాసిన కథలు తను చదివానని, బావున్నాయని కథలు పంపుతూండమని చెప్పారు. ఆయన తన భార్యని కూడా పరిచయం చేసారు. ఆమె పేరు కృష్ణకుమారి. కథలని ఆమే చదివి ఎంపిక చేసేవారు. ఒకటి రెండుసార్లు నాగేశ్వరరావుగారి ఆహ్వానం మీద వారింటికి వెళ్ళినప్పుడు పెండింగ్ లో ఉన్న నా కథ పేరు చెప్పి, అది ఏక్సెప్ట్ చేసామని ఆమె చెప్పారు. వారికి ఇద్దరు అమ్మాయిలు. వారి డ్రాయింగ్ రూంలో చాలా ఇంగ్లీష్ పుస్తకాలు, లైబ్రరీలోలా అమర్చి ఉండేవి. ఓ సారి ఆయన తన ఇల్లంతా చూపించారు. బెడ్‌రూంలో మంచం ఎదురుగా ఓ నిలువుటద్దం ఉండేది. శ్రీ వీరేంద్రనాథ్ గెస్ట్ హౌసులోకూడా బెడ్ రూంలో మంచం మీద సీలింగ్ కి పెద్ద అద్దం ఉంది. చాలా కాలం నేను తాళ్ళూరి గారి బెడ్ రూం ఇందుకు ప్రేరణ అనుకునే వాడిని. కాని ఇది రాసేప్పుడు వారిని అడిగితే వారు 1984 లో మద్రాసులోని విజిపి గార్డెన్ గెస్ట్ హౌస్ లోని బెడ్ రూం లో ఇలాంటి అద్దాన్ని చూసి ఏర్పాటు చేసానని వివరించారు. ఆ రోజుల్లో ఈ ఇద్దరు రచయితలకే కార్లుండేవి. శ్రీ తాళ్ళూరి స్నేహశీలి నిర్మొహమాటంగా, ముక్కుసూటిగా వ్యవహరించేవారు. ఆయన విమానంలో ఢిల్లీ వెళ్ళివస్తుండేవారు. కారణం నాకు గుర్తులేదు. ఓసారి నాకు వారింట్లో లిక్కర్‌ని కూడా ఇచ్చారు.



శ్రీ తాళ్ళూరి విమానంలో వస్తూ గుండెపోటుతో మరణించారు. ఆ తర్వాత నేను వారింటికి మళ్ళీ వెళ్ళలేదు. చాలా ఏళ్ళ తర్వాత వారింటిని అమ్మేసారని, ఆ ఇంటిని పడగొడుతూండటం చూసి గ్రహించాను. ఇప్పుడు ఆ స్థలంలో ఓ నార్త్ఇండియన్ ఇల్లు కట్టుకున్నాడు. తాళ్ళూరి గారి భార్య గాంధీనగర్లో అప్పుడప్పుడు కనబడేవారు కాని పలకరించేవాడిని కాదు.

శ్రీ తాళ్ళూరి యువలో ఒకే సంచికలో నేను రాసిన రెండు కథలని ప్రచురించారు. తర్వాత శ్రీ చంద్ర 'ఇలా ఒకే రచయిత కథలు రెండు వేయడం సబబు కాదని' తనకి చెప్పారని శ్రీ తాళ్ళూరి నాగేశ్వరరావు నాతో అన్నారు. శ్రీ చంద్రే ఆ రెండు కథలకి బొమ్మలు గీసింది. శ్రీ తాళ్ళూరి మరణించాక యువ మాసపత్రికని దండమూడి మహీధర్ చూసేవారు. చివరికి యువ మాసపత్రికని మూసేసారు. యువ పత్రిక ముద్రించే డాల్టన్ ప్రెస్ మాత్రం కొంతకాలం కొనసాగింది.

## శ్రీ వేమూరి సత్యనారాయణ

జ్యోతి మాస పత్రిక మద్రాస్ నుంచి వెలువడేది. దానికి నేను పంపిన మొదటి కథ 'కాకులు' సెప్టెంబర్ 1971 సంచికలో ప్రచురింపబడింది అప్పుడు జ్యోతి కార్యాలయం టి.నగర్ లోని శివాజీ స్ట్రీట్లో ఉండేది. తర్వాత టి నగర్ లోనే మూసా స్ట్రీట్కి షిఫ్ట్ అయింది. 1973 దాకా శ్రీ వ్యాస్చంద్ జ్యోతి మంత్లీ ఎడిటర్గా ఉండేవారు. వారితో నాకు పరిచయం లేదు. తర్వాత 1973లో శ్రీ వేమూరి సత్యనారాయణ నుంచి, తను జ్యోతి మంత్లీ ఎడిటర్గా చేరానని ఎప్పటిలా రచనలు పంపి సహకరించమని నాకు ఉత్తరం వచ్చింది. నేను పంపిన కథలకి పూర్వంలా ప్రింటెడ్ కార్డ్ ద్వారా ఇంటిమేషన్ కాక, శ్రీ వేమూరి నుంచి వ్యక్తిగత ఉత్తరాలు వస్తూండేవి.



1973లో ఓసారి నేను మద్రాస్ వెళ్ళినప్పుడు డైరెక్టర్స్ కాలనీలోని జ్యోతి మంత్లీ కార్యాలయానికి వెళ్ళాను. శ్రీ వేమూరి సత్యనారాయణ పూర్వం హైదరాబాద్లోని స్వాతి మంత్లీ ఆఫీస్లో శ్రీ శీలా వీర్రాజు నా శైలి గురించి చేసిన మంచి కామెంట్ని గుర్తు చేసారు. కింద పోర్షన్లో జ్యోతి మంత్లీ కార్యాలయం ఉండేది. పై పోర్షన్లో దర్శకుడు శ్రీ కె.బి తిలక్ ఉండేవారు.

నేను మద్రాస్ వెళ్ళినప్పుడల్లా తప్పకుండా శ్రీ వేమూరిని కలిసేవాడిని. డైరెక్టర్స్ కాలనీలోనే అనేకమంది తెలుగు చిత్ర దర్శ కులు, తెలుగు సినిమా పరిశ్రమకి చెందినవారు ఉండేవారు.

ఓ రోజు వేమూరిగారితో మాట్లాడుతూండగా ఒకాయన వచ్చి 'టైమ్ మేగజైన్ వచ్చిందా?' అని అడిగారు. వెంటనే శ్రీ వేమూరి గౌరవంగా లేచి నిలబడివారికి ఆ వారం టైమ్ వారపత్రికని ఇచ్చారు. నన్ను పరిచయం చేసారు. ఆయన ఏం మాట్లాడకుండా వెనక్కి తిరిగి వెళ్ళిపోయాక శ్రీ సత్యం నాతో చెప్పారు.

"ఆయన శ్రీశ్రీ టైం మేగజైన్ కోసం వస్తూంటారు."

ఆ తర్వాత మళ్ళీ నేను శ్రీశ్రీగారిని చూడలేదు. ఇలాగే మరోసారి రోడ్డు మీద నడిచి వెళ్ళే గీత రచయిత దాశరధిని పాండీబజారులో అనుకుంటా, చూపించారు.

శ్రీ సత్యంకి చాలామంది రచయితలతో స్నేహం ఉండేది. కొందరు మద్రాస్ వచ్చినప్పుడు శ్రీ సత్యం ఇంట్లో ఉండేవారు. జ్యోతి మంత్లీ దీపావళి ప్రత్యేక సంచికలోని కథలకి బొమ్మలు గీయడానికి శ్రీ చంద్ర మద్రాస్ వెళ్ళి శ్రీ సత్యం ఇంట్లో ఉండటం నాకు తెలుసు.

శ్రీ సత్యం ఒకసారి జెమినీ సర్కిల్ ఓవర్ బ్రిడ్జి కింద ఉన్న ఓ సెకండ్ హేండ్ పుస్తకాల షాపులో 'ఎమిల్ అండ్ ది డిటెక్టివ్స్' అనే పుస్తకాన్ని కొన్నారు. అది ఆయనకి చాలా బాగా నచ్చింది. దాన్ని సినిమాగా మిత్రులు సహాయంతో తీయాలనే సంకల్పం కలిగింది. ఆ విషయం మీద నాకు ఉత్తరం వ్రాసి మద్రాస్ వచ్చి, స్క్రిప్ట్ పనిలో సహకరించమని కోరారు. నేను శెలవు పెట్టి మద్రాసు వెళ్ళాను. స్టేషన్‌కి వచ్చి రిసీవ్ చేసుకుని కోడంబాకంలో వరదరాజ్ పేట మెయిన్ రోడ్ ప్రాంతంలో ఉన్న తన ఇంటికి తీసుకెళ్ళారు. ఓ ఇంట్లో వెనక వైపు విశాలమైన జాగాలోని చక్కటి అవుట్ హౌస్‌లో శ్రీ వేమూరి అద్దెకుండేవారు. ఆ నవల చదివాను. ఓ చిన్నపిల్లవాడు రైల్లో వెళుతూంటే ఓ దొంగ, వాడి టిక్కెట్‌ని, డబ్బుని కొట్టేస్తాడు. ఎమిల్ అనే ఆ పిల్లవాడు తన వయసు మిత్రులతో కలిసి ఆ దొంగని పట్టుకోవడం ఆ నవలలోని కథ. శ్రీ వేమూరి గారి అబ్బాయి బాబీ (శ్రీధర్) ఆ కథ విని చాలా ఇన్‌స్పైయిర్ అయి తను ఆ పాత్రని వేస్తానని చెప్పేవాడు. సత్యంగారి తల్లి శ్రీమతి విశాలక్ష్మిగారు వంట బాగా చేసేవారు. నాకింకా గుర్తు. ఓ పూట ఆవిడ చేసిన టొమేటో పచ్చడితోనే అన్నమంతా తినేసాను. సత్యంగారి భార్య శ్రీ లక్ష్మి, కూతురు నాని,(శ్రీదేవి). ఆయన నవ్వుతూ ఈ మాటన్నారు.

"మా ఇంట్లో లక్ష్ములు ఎక్కువ - మా అమ్మ లక్ష్మి, మా ఆవిడ పేరులో ఇద్దరు లక్ష్ములున్నారు. మా అమ్మాయి, మా అబ్బాయి పేర్లలో కూడా లక్ష్ములు ఉన్నారు. "

అదే ఇంట్లో జర్నలిస్ట్ మిక్కిలినేని జగదీష్ బాబుకూడా అద్దెకి ఉండేవాడు. ఆంధ్రజ్యోతి, జ్యోతిచిత్రలకి ఆయన ఫిల్మ్ జర్నలిస్ట్‌గా పనిచేసేవారు. తర్వాత సితారకి మారారు. మోహన్‌బాబు హీరోగా, పరిటాల రవీంద్ర తండ్రి జీవిత చరిత్ర ఆధారంగా తీస్తున్న 'శ్రీ రాములయ్య' చిత్రం ప్రారంభ దినోత్సవ సమయంలో జరిగిన బాంబు బ్లాస్ట్‌లో ఈ టీ.వి ఛానల్ వేన్ బలయ్యింది. దురదృష్టవశాత్తూ శ్రీ జగదీష్ బాబు అందులో ఉన్నారు. ఆ తర్వాత మరి లేరు.

శ్రీ వేమూరి ద్వారా నాకు అనేక మంది ప్రముఖులు పరిచయం అయ్యారు. వారిలో శ్రీ నందగోపాల్ ఒకరు. తెలుగు సినిమా ఇండస్ట్రీ మొత్తం శ్రీ నందగోపాల్‌ని గౌరవిస్తారు. ఎందుకంటే చాలామంది ఫిల్మ్ జర్నలిస్ట్‌లు నిర్మాతల నుంచి డబ్బు తీసుకుని వారి చిత్రాలని పొగుడుతూ రాయడం ఆనవాయితీ. బ్రీఫ్ కేసులు మొదలైనవి నిర్మాతలు బహుమతులుగా కూడా ఇచ్చేవారు. కానీ శ్రీ నందగోపాల్ మాత్రం వారి నుంచి ఎన్నడూ పైసా తీసుకునేవారు కాదు. శ్రీ దాసరి నారాయణరావు గారింటి అవుట్ హౌస్‌లో శ్రీ నందగోపాల్ అద్దెకుండేవారు. తెల్లటి లుంగీ, తెల్లటి చొక్కా ధరించేవారు. ఆయన, నేను, శ్రీ సత్యం కలిసి పామ్‌గ్రోవ్‌లో జయచిత్ర జరిపిన ప్రెస్ మీట్‌కి వెళ్ళాం. జయచిత్ర తొలిసారి సింగపూర్ వెళ్ళివచ్చాక ఆ అనుభవాలని వివరించడానికి ప్రెస్ మీట్‌ని ఏర్పాటు చేసింది. అక్కడ ఆయన స్నాక్స్ కూడా తీసుకోకపోవటం గమనించాను. నంద గోపాల్‌ని అభిమానించేవారిలో ఒకరు ఎన్.టి. ఆర్. ఆయన ముఖ్యమంత్రి అయ్యాక నంద గోపాల్‌ని ఆంధ్రప్రదేశ్ సెన్సారు బోర్డు సభ్యునిగా వేసారు. 1989, 1990లలో హైదరాబాదులో నందగోపాల్ గారిని చాలాసార్లు చూసాను. శ్రీ వంశీ కూడా అప్పట్లో జ్యోతి మంత్లీలో కథలు రాసేవారు. శ్రీ సత్యం ఓసారి ఆయన్ని నాకు పరిచయం చేసారు. తర్వాత మంచు పల్లకీ ద్వారా శ్రీ సత్యం అతన్ని దర్శకుడిని చేసారు.




శ్రీ సత్యంకి సినిమా పరిశ్రమలోని వ్యక్తులతో మంచి పరిచయాలుండేవి. కొన్ని సినిమాలకి పి.ఆర్.ఓగా పని చేసేవారు. టి.నగర్‌లోని శ్రీధనికొండ హనుమంతరావు ప్రెస్‌కి నన్ను ఓ సాయంత్రం తీసుకెళ్ళారు. హనుమంతరావుగారు, వారబ్బాయి శ్రీ శ్రీధర్‌లు శ్రీ సత్యం ద్వారానే పరిచయం. తర్వాత శ్రీ శ్రీధర్ నడిపిన ఓ చిన్న పిల్లల పత్రికకి నేను కొన్ని కథలు కూడా రాసాను.

శ్రీ జంధ్యాలని, శ్రీ చలసాని ప్రసాదరావుని కూడా నాకు పరిచయం చేసారాయన.

శ్రీ వేమూరి హైదరాబాద్ వచ్చినప్పుడు వెంగళరావు నగర్‌లోని తన భార్య వైపు బంధువు ఇంటికి నన్ను రెండు మూడు సార్లు తీసుకెళ్ళారు. వ్యాపారస్తుడైన ఆయన పేరు శ్రీ మండవ గోపాలకృష్ణ. క్రాంతి కుమార్ దర్శకత్వంలో గౌతమి, విజయచందర్ హీరోగా 'వేమన చరిత్ర' చిత్రాలని వీరు నిర్మించారు. మండవ గోపాలకృష్ణ భాగస్వామిగా హరి అనుమోలు దర్శకుడుగా తీసిన 'పోలీస్ రిపోర్ట్' అనే చిత్రానికి నేను సంభాషణలు రాసాను.

1974 లో శ్రీ సత్యానికి, నాకు జ్యోతి మంత్లీ కోసం ఓ డ్రీం ప్రాజెక్ట్ ఉండేది. ఢిల్లీకి కేవలం టిక్కెట్‌తో, కట్టుబట్టలతో నేను వెళ్ళి, అక్కడినుంచి అన్ని రాష్ట్రాలు తిరిగి హైదరాబాద్ చేరాలి. కండిషన్ ఏమిటంటే ఇతరులని మోసం చేసికాని, దొంగతనం చేసి కాని, అడుక్కుని కాని డబ్బు సంపాదించకుండా వెనక్కి రావాలి. జ్యోతి మంత్లీ పాఠకులకి బయలుదేరే రోజుని ముందే ప్రకటించి, తర్వాత సంచికలో ఆ అనుభవాలు ప్రచురించాలి. ఒకవేళ నెలలోగా తిరిగి రాలేకపోతే తర్వాతి నెలకి అనుభవాలని ఇష్యూ క్లోజింగ్ డేట్‌కి అందేలా నేను రాసి పోస్ట్ చేయాలి. గవర్నమెంట్ ఉద్యోగిగా ఉన్న నాకు అంత సెలవు దొరక్క ఆ పని చేయలేకపోయాను.

శ్రీ వేమూరికి మరో డ్రీమ్ ప్రాజెక్ట్ ఉండేది. ఓ కొత్త సినిమా కథా చర్చలు మొదలైన రోజు నుంచి, థియేటర్‌లో సినిమా రిలీజయ్యేదాకా ఆ ప్రాజెక్ట్‌తో అసోసియేటై, చిత్ర నిర్మాణంలోని అన్ని అంశాలని ఓ పుస్తకంగా రాసి ప్రచురించాలని. దానికి ఆయన నన్ను ఎన్నుకున్నారు. నాకూ అది ఎంతో ఆసక్తిగా ఉండేది. కానీ ఏ నిర్మాతా సహకరించకపోవడంతో అనుకుంటా ఇదీ కుదరలేదు. కోడంబాకం మెయిన్ రోడ్ లోని చక్కటి టీ దొరికే హాలీవుడ్ హోటల్లో రాత్రి పదకొండు దాకా కూర్చుని ఇలాంటివి చర్చించుకునే వాళ్ళం. మరే ఎడిటరూ ఇంత క్రియేటివ్‌గా నాతో ఇంటరాక్ట్ కాలేదు.

1978లో అనుకుంటా జ్యోతి ప్రత్యేక సంచికకి నేను 'అల్లిక' అనే పేరుగల కథని రాసాను. దానికి తనే బొమ్మ గీసానని, చూడమని శ్రీ సత్యం నాకు ఉత్తరం రాసారు. చిక్కుపడ్డ దారంలా కనిపించే గీతలే ఆ బొమ్మ!

"మీ కథ కాబట్టి ఆ చనువు తీసుకున్నాను" అని ఆ ఉత్తరంలో రాసారు. మరో సందర్భంలో నేను రాసిన ఓ కథని వెనక్కి పంపుతూ, 'సరిగ్గా ఇదే థీంతో మరో రచయిత కథని, ఇదే బేచ్‌లో చదివాను. మీకథ బెటర్‌గా ఉన్నా, దాన్ని ఏ పత్రికలో అయినా ప్రచురిస్తారు. ఆ రచయితకి ఆ అవకాశం రాకపోవచ్చు కాబట్టి దాన్ని తీసుకుని మీది రిటన్ చేస్తున్నాను." అని రాసారు.

నేను 'మేఘమాల' అనే నవలని మేనిఫోల్డ్ (టైప్ రైటర్‌లో కార్బన్ కింద పెట్టే పల్చటి) కాగితాల్లో, టర్క్వాయిస్ బ్లూ ఇంక్ పోసిన పెన్నుతో రాసి పంపాను. నేను భిన్నంగా ఉండాలనుకుని ఆ రంగు ఇంక్ బాటిల్‌ని కొన్నాను. పల్చటి పేపర్ వాడడానికి రెండు కారణాలు. ఒకటి అడుగున కార్బన్ పెట్టి రాస్తే ఇంప్రెషన్ స్పష్టంగా ఉంటుంది. రెండోది బరువు తగ్గి పోస్టేజి తక్కువవుతుంది. దాన్ని చదివాక ఎన్నిక చేసానని రాస్తూ శ్రీ వేమూరి రెండు విషయాలు రాసారు.

'అంత పల్చటి కాగితం మీద నీలం రంగు ఇంక్‌తో రాసిన స్క్రిప్ట్ చదవడం కళ్ళకు ఎంతో అసౌకర్యంగా అనిపించింది, ఇంకెప్పుడూ అలా రాయొద్దు. నవల చివర్లో హీరో, హీరోయిన్‌ని చూసి రోడ్డు దాటుతూంటే, కారు వచ్చి గుద్దుకుని మరణిస్తాడు. చిన్నప్పుడు వివాహం చేసుకున్న హీరో తన భార్య కోసం వెదికి వేటాడాక ఆమెని చేరుకోబోయే ముందు అలా మరణించడం క్రూరంగా ఉంది, ఇంకాస్త సరళంగా ఉండే క్లైమాక్స్‌ని రాసి పంపండి అని కోరారు.

హీరో ఆమెని కలిసే సమయానికి ఆమె రిజిస్ట్రార్ ఆఫీస్‌లో మరొకర్ని పెళ్ళిచేసుకుని బయటకి రావడం అనే క్లైమాక్స్‌ని తిరిగి రాసి పంపాను. అది శ్రీవేమూరికి నచ్చింది. దాన్ని జ్యోతి మంత్లీలో సీరియల్‌గా వేద్దామనుకున్నారు కాని, శ్రీమతి లీలావతీ రాఘవయ్య గారు ఆ ప్లేస్‌లో కుమారి వాసిరెడ్డి సీతాదేవి నవలని సీరియల్‌గా వేయమని చెప్పడంతో అది కుదరలేదు. సరిగ్గా అప్పుడే పాకెట్ సైజ్‌లో జ్యోతి సప్లిమెంట్‌ని వెలువరించారు. దాంట్లో రావాల్సిన వాసిరెడ్డి సీరియల్ స్థానంలో 'మేఘమాల'ని సీరియల్ గా వేసారు. అందువల్ల ఓ

మంచి నవల పెద్దగా గుర్తింపు లేకుండా సీరియలైజ్ అయింది. ఏడేళ్ళ తర్వాత అది పుస్తకరూపంలో వచ్చాక పాఠకుల విశేష అభిమానాన్ని చూరగొంది. ఇప్పటికీ అది నా బెస్ట్ సెల్లర్స్‌లో ఒకటి.

రెమ్యునరేషన్ పంపే విషయంలో నాకు, శ్రీ వేమూరికి చిన్న తగాదా వచ్చేది. నేను బ్రహ్మచారిగా ఓ గదిలో అద్దెకుండేవాడిని. పోస్ట్‌మేన్ వచ్చే సమయంలో నా గది తాళం పెట్టి ఉంటుంది. నేను పనిచేసే ఆఫీస్‌లో నన్ను ఆడిట్‌కి పంపుతూండేవారు. కాబట్టి పర్మినెంట్ ఆఫీస్ అడ్రస్ అంటూ ఉండేది కాదు. అందుచేత పత్రికలకి నా గది అడ్రస్సే ఇచ్చేవాడిని. పోస్ట్‌మేన్ నా గదికి వచ్చినప్పుడు నేను ఆఫీసులో ఉండేవాడిని. పారితోషికం మనియార్డర్ వచ్చి, ఏడురోజుల తర్వాత తిరిగి వెనక్కి వెళ్ళిపోతుంది. అందువల్ల నా సమస్య వివరిస్తూ పారితోషికాన్ని నాకు చెక్కు ద్వారా పంపమని శ్రీ సత్యానికి ఉత్తరం రాస్తే, అందుకు ఒప్పుకోలేదు. శ్రీ మధురాంతకం రాజారాం ఓ పల్లెటూరులో ఉంటారని, చెక్ ద్వారా పంపితే ఆయన తన ఊరి నుంచి చిత్తూరికి బస్ లో వెళ్ళి, బేంక్‌లో చెక్ వేసుకోవాలని మళ్ళీ కేష్ డ్రా చేయడానికి ఇంకోసారి వెళ్ళిరావాలని, కాబట్టి మనియార్డరే సౌకర్యమని జవాబు రాసారు. అంతే తప్ప, నాకు చెక్ ద్వారా పారితోషికం పంపేవారు కాదు. 1976లో 'పడమటి సంధ్యారాగం' అనే సీరియల్‌ని రాసి పంపితే వేసారు. దానికి నేను పెట్టిన పేరు 'పిడికెడు బూడిద' శ్రీ వేమూరి 'పడమట సంధ్యారాగం'గా మార్చానని, నేను పెట్టిన పేరు అర్ధవంతంగా లేదని రాసారు. ఆ పేరుని నవలకి అన్వయిస్తూ ఆఖరి పేరాలని తిరగరాసి పంపాను.

1981లో జ్యోతి మంత్లీ హైదరాబాద్‌కి షిఫ్ట్ అయింది. అప్పటికే సినిమాల్లో పి.ఆర్.ఓగా పనిచేస్తున్న శ్రీ వేమూరి హైదరాబాద్ రాదలచుకోలేదు. శ్రీమతి లీలావతి రాఘవయ్యగారి అబ్బాయి శ్రీగాంధీ జ్యోతికి ఎడిటర్ అయ్యారు.

హైదరాబాద్ వచ్చినప్పుడల్లా శ్రీ వేమూరి నాకు ఫోన్ చెయ్యటం, మేం కలవడం జరిగేది. ఓసారి అశోకా హోటల్‌లోని ఓ గదిలో రాత్రి పన్నెండు దాకా ఆయన మిత్రులతో పేకాడుతూంటే, నేనూ పక్కనే ఉన్నాను. మర్నాడు ఉదయం తొలిసారి ఆయన విమానంలో హైదరాబాద్ నుంచి మద్రాస్ వెళ్ళారు. వి.ఐ.పి సూట్ కేస్‌ని ప్రత్యేకంగా ఆ ప్రయాణం కోసం కొన్నారు. ఆయన విమాన ప్రయాణం మీద చాలా జోకులు వేసుకున్నాం. శ్రీ వేమూరి సత్యనారాయణకి ఎలాంటి చెడ్డ అలవాట్లు లేవు. సరదాకి మిత్రులతో పేకాట తప్ప. ఇండస్ట్రీలో ఉంటూ మందు, ఇతర వ్యసనాలు లేకపోవడం మెచ్చుకోతగ్గ విషయం. నిజాయితీగా వ్యవహరించడం నిబద్ధతగా ఉండటం వారి ప్రత్యేకతలు.

ఓసారి గాంధీ నగర్‌లోని మా ఇంటికి 1986లో ఒకరోజు శ్రీ క్రాంతి కుమార్ దర్శకత్వంలో చిత్రనిర్మాణానికి కథ ఉందని, దాన్ని డెవలప్ చేసి, డైలాగ్‌లతో స్క్రిప్ట్ ఇస్తే, దాన్ని శ్రీ క్రాంతికి ఇస్తానని, పేమెంట్ విషయంలో గేరంటీ ఇవ్వలేనని, అసలు ఆ ప్రాజెక్ట్ టేకాఫ్ కాకపోవచ్చని కూడా చెప్పారు. సంభాషణలు నా చేత రాయిస్తేనే వర్క్ చేస్తానని గట్టిగా చెప్పాను. అప్పట్లో సినిమాలకి డైలాగ్స్ రాయాలనే కోరిక నాకు బలంగా ఉండేది.

శ్రీ వేమూరి నిక్కచ్చి, నిజాయితీగల మనిషి. ఆయన స్థానంలో మరొకరుంటే, సరేనని మభ్య పెట్టి రాయించుకునేవారు ఆయన చాలా స్పష్టంగా చెప్పారు.

"స్వాతి సినిమా హిట్ అవడానికి గణేష్ పాత్రో డైలాగ్స్ కూడా హెల్ప్ చేసాయి. అలాంటి ప్రూవ్డ్ రైటర్ తోనే ఆయన డైలాగ్స్ రాయించుకుంటానంటారు తప్ప మీకు అవకాశం ఇవ్వరు. కాకపోతే మీరు మీ స్క్రిప్ట్ ద్వారా ఆయన దృష్టిలో పడే అవకాశం ఉంటుంది."

అప్పటికే కమర్షియల్ నవలలతో బిజీగా ఉన్న నేను సారీ చెప్పేసాను. ఆ తర్వాత కొంతకాలానికి శ్రీ వేమూరి హైదరాబాద్‌లోని ఓ చిత్ర దర్శకుడి కూతురి పెళ్ళిలో తారసపడ్డారు. అలా రెండు మూడుసార్లు ఫంక్షన్స్‌లో కలుసుకున్నాం.

ఓసారి మా కామన్ ఫ్రెండ్ స్రవంతీ మూవీస్ రవికిషోర్, శ్రీ వేమూరి హైదరాబాద్‌కి షిఫ్ట్ అయ్యారని చెప్పారు. అడపదడపా శ్రీ వేమూరి ఫోన్ చేస్తూనే ఉంటారు. 1976 లో నాకు 'ది రెడ్ అండ్ ది బ్లాక్' అనే ఇంగ్లీష్ నవల ఇచ్చి 'దీంట్లో హీరో, హీరోయిన్ ఒకే గదిలో ఓ రాత్రి ఎంత వ్యామోహం ఉన్నా పవిత్రంగా గడుపుతారు. వారి ఫీలింగ్స్‌ని రచయిత గొప్పగా రాసాడు. ఆ ఛాప్టర్ కోసమైనా మీరీ నవల చదవాలి' అన్నారు. 2009 లో ఓ రోజు ఫోన్ చేసి 'ఆ నవల మీ దగ్గర ఉందా? మీకు ఇచ్చినట్లు గుర్తు' అని అడిగారు. నేను వెదికితే అదృష్టవశాత్తూ అది నా దగ్గరే ఉంది. దాన్ని శ్రీ నగర్ కాలనీలో ఓ ఇంటికి చేరుస్తానని, అక్కడికి దగ్గర కాబట్టి వారింటి నుంచి తీసుకోమని చెపితే సరే అన్నారు.

సాహిత్యరంగంలో నాకు తారసపడ్డ ఓ మంచి సంపాదకుడు, ఓ మంచి వ్యక్తి, ఓ మంచి మిత్రుడు శ్రీ వేమూరి సత్యనారాయణ.

**పాఠకుల ప్రశ్నలకు మల్లాది గారి జవాబులు:**

సంపాదకులకు-

జూలై 2010 సంచికలో "నా సాహితీ జీవనంలో జరిగిన కథ" అనే శీర్షికలో, మల్లాది వెంకట కృష్ణమూర్తి గారు "నాకు గుర్తున్న ఓ విషయమిది. రంగనాయకమ్మ బాపినీడు గారికి, తనకి కాంప్లిమెంటరీ కాపీ పంపడాన్ని నిరసిస్తూ ఓ ఉత్తరం రాసారు. దాన్ని 'విజయ'లో వేసారో లేదో గుర్తు లేదు" అని రాశారు.

1. అయితే రంగనాయకమ్మ గారు ఏమని నిరసించారు.? ఎందుకు నిరసించారు? ఈ విషయాలు రచయిత తెలియచేస్తే పాఠకులకు అర్థం అయ్యేది విషయం.

2. 'విజయ' లో ప్రచురణ అయిందో లేదో తెలియని ఉత్తరంలోని సంగతులు రచయితకి ఎలా తెలిశాయో తెలియచేయగలరా? 'విజయ' సంపాదకులు ఆ ఉత్తరాన్ని రచయితకి చూపించారా?

ఈ ప్రశ్నలకి రచయిత సమాధానాలు ఇస్తే పాఠకులకి విషయాలు బాగా అర్థం అవుతాయని అనుకుంటాను.

***జె.యు.బి.వి.ప్రసాద్***

***మల్లాది గారి జవాబు:***

(1) ఏమని నిరసించారో వారి మాటల్లో స్పష్టంగా గుర్తులేదు. 'నేను చదవాలనుకోని పత్రికని నాకు పంపి ఎందుకు నాకు కాలహరణం చేస్తారా? ' అనో లేదా "నేను కోరని పత్రికని నాకిక పంపొద్దు .." అనో ఇలాంటిదేదో ఆ ఉత్తరంలో చెప్పారని లీలగా గుర్తు.

(2) 99% ఆ ఉత్తరాన్ని 'విజయ' లో ప్రచురించారనే గుర్తు. ప్రచురించకపోతే చూసిన వారు కానీ, అక్కడి సిబ్బందికానీ చెప్పి ఉండొచ్చు. ఆ ఉత్తరాన్ని నేను చూడలేదు. ఆవిడ చిరునామాని కాంప్లిమెంటరీ కాపీలు పంపే జాబితా నుంచి తొలగించారని చెప్పారన్నట్లు గుర్తుంది. ఇప్పుడైతే ఆ విషయాలు కాస్త స్పష్టంగా అర్థం అవుతాయని ఆశిస్తాను.

****NEW****
**Click here to share your comments on this article**